


Bali

# పొగబండి కథలు



ఓలేటి శ్రీనివాసభాను

"అమ్మాయ్ సరళా"
స్టేషన్ మాస్టర్ ముకుందం గొంతు రైల్వేస్టేషన్ కిటికీలోంచి పొరుగునే ఉన్న తమ క్వార్టర్స్‌లోకి వినిపించింది. నాన్న అలా పిలిచారంటే ఉదయం పదకొండ యిందని అప్పుడే వంట పూర్తి చేసిన సరళకి అర్థమయిపోతుంది. ఉదయం పదకొండు గంటలకి ఆ స్టేషన్‌లో క్యాష్ క్లోజ్ చెయ్యాలి. అంటే గడిచిన ఇరవై నాలుగ్గంటల్లో స్టేషన్ గడించిన ఆదాయాన్ని అణాపైసలతో సహా లెక్కగట్టి, రికార్డు పుస్తకాల్లో స్పష్టంగా నమోదు చేసి, నగదు మొత్తాన్ని డినామినేషన్ల వారీగా పేర్కొంటూ ఫారాన్ని నింపాలి. ఆ ఫారాన్నీ, నగదునీ, ఓచర్లనూ ఓ తోలుసంచీ-'క్యాష్ బ్యాగ్' అంటారు దాన్ని-అందులో భద్రపరిచి, మూతి బిగించి, స్టేషన్ ముద్రతో లక్క సీలు వెయ్యాలి. స్టేషన్ మాస్టార్లు రోజూ చెయ్యాల్సిన తతంగం ఇది.



మధ్యాహ్నం పన్నెండుంపావుకి త్రీ అప్ ప్యాసింజర్ ఆ స్టేషన్‌లో ఆగుతుంది. అందులో గార్డు పెట్టెని ఆనుకొనే లగేజ్ వ్యాన్‌లో క్యాష్‌చెస్ట్ ఉంటుంది. పోత ఇనుముతో చేసిన ఆ క్యాష్‌చెస్ట్ చూడ్డానికి పెద్ద హోటల్‌లోని రుబ్బురోలులా ఉంటుంది. దానికి గంగాళం చెవుల్లా అటూ ఇటూ పెద్ద రింగులు... వాటిని లగేజ్‌వ్యాన్‌తో బంధించిన ఇనప గొలుసులూ, తాళం కప్పలూ వగైరా సెక్యూరిటీ ఏర్పాట్లు! త్రీ అప్ ప్యాసింజర్ రాగానే ముకుందం మాస్టారు లగేజ్ వ్యాన్‌లోకి వెళ్లి, హుండీలో కానుకలు వేసినట్లుగా క్యాష్‌బ్యాగ్‌ని చెస్ట్‌లో డ్రాప్ చేసి, గార్డు సంతకం తీసుకుంటారు. బండి గమ్యం చేరాక క్యాష్‌చెస్ట్ డివిజనల్ క్యాష్ ఆఫీసుకి చేరుతుంది. అక్కడ సెక్షన్ల వారీగా క్యాష్ చెస్ట్‌లు తెరిచి సిబ్బంది లెక్కలు సరిచూసుకుంటారు. ఆ సిబ్బందితో పాటు తాత్కాలిక ప్రాతిపదిక మీద కొందరు ఏఎస్ఎమ్‌లు 'క్యాష్ విట్‌నెస్'లుగా వంతుల వారీగా పని చేస్తారు. వారి సమక్షంలో లెక్కలు చూసి, ఎక్నాలెడ్జ్‌మెంట్ మీద సంతకాలు చేసి, ఖాళీ తోలు సంచీతో పాటు మర్నాటి తిరుగు ప్యాసింజరులో స్టేషన్లకు డిస్పాచ్ చేస్తారు.

ముకుందం మాస్టారు పని చేస్తున్న ఆ చిన్న స్టేషన్‌లో చెప్పుకోదగ్గ వసూలు లేదు. ఒకప్పుడు ఉండేది. స్టేషన్‌లో ప్రయాణికుల రాకపోకలు బాగా ఉన్నప్పుడు టిక్కెట్ల అమ్మకం జోరుగా సాగేది. ఆ రోజుల్లో స్టేషన్‌కి దూరంగా ఉన్న పల్లెటూరి జనానికి ఊరు దాటాలంటే పొగబండే దిక్కు. కానీ ఏణ్ణర్థంగా పరిస్థితి మారిపోయింది. ఆ పల్లె మీదుగా జాతీయ రహదారి పడింది. బస్సులొచ్చాయి. ఆటోలూ వచ్చిపోతున్నాయి. ఇప్పుడు ఊరి జనాలకి త్రీ అప్, ఫోర్‌డౌన్ ప్యాసింజర్లతో పనిలేదు. ఎటొచ్చీ ఎక్స్‌ప్రెస్ బళ్లు ఆ స్టేషన్‌లో ఆగవు. మహా అయితే రోజు మొత్తంలో ఒకరిద్దరు ప్రయాణికులు టిక్కెట్లు కొంటారు. అదీ వాళ్ల దయా ధర్మం. తిప్పికొడితే అయిదు రూపాయల కలెక్షను కూడా ఉండదు. అయినా రూలు రూలే! అకౌంట్ క్లోజ్ చెయ్యాలి... క్యాష్ బ్యాగ్ డ్రాప్ చెయ్యాలి.

"అంబలి ఖర్చుకన్నా ఆవకాయ ఖర్చెక్కువన్న



ట్లుంది వ్యవహారం'' ప్రతిరోజూ క్యాష్ క్లోజింగ్ తంతు ముగిస్తూ ముకుందం మాస్టారు సణుగు తూనే ఉంటారు. అలా సణుగుతూనే-''అమ్మాయ్ సరళా''అంటూ కూతుర్ని పిలుస్తారు. ఆ పిలుపు కోసమే నిరీక్షిస్తున్న సరళ అగ్గిపెట్టె, దీపం బుడ్డీ తీసుకుని గబగబా వస్తుంది. దీపాన్ని వెలిగించి, ఆ జ్వాల కొసల్లో లక్కని వేడి చేస్తుంది. కరిగి మెత్తబడిన లక్క ముద్దగా పడుతుంటే క్యాష్ బ్యాగ్ ముడి మీద పడేలా చేసి స్టేషన్ సీల్‌తో ఒత్తుతుంది. తండ్రికి ఆ కొద్దిపాటి సాయం చెయ్యడం ద్వారా సరళకి టైమ్ పాస్‌తో పాటు సంతోషం లభిస్తుంది. రోజంతా మౌనంగా ఉండే తండ్రితో కాసేపైనా మాట్లాడే అవకాశం దొరికినందుకు ఆ అమ్మాయి 'క్యాష్ బ్యాగ్'కి థాంక్స్ చెబుతుంది.

ముకుందం మాస్టారు ఇప్పుడలా ఉన్నారు గానీ ఒకప్పుడు కలివిడిగా ఉండేవారు. పెళ్లయిన కొత్తలో మారు మూల అడవి స్టేషన్లలో మహా సరదాగా గడిపేవారు.

ఏడాది తిరగ్గానే సరళ పుట్టింది. ప్రసవ సమయంలో ముకుందం మాస్టారి భార్యకి చికాకు చేసింది. సరైన చికిత్స దొరకలేదు. రెండోసారి తల్లి కాబోయినప్పుడు అర్ధరాత్రి నొప్పులొచ్చాయి. వర్షంలో తెల్లవారగట్ల ప్యాసింజరులో పట్నం డాక్టరుకి చూపించాలని తీసుకువెళ్తుంటే- కంపార్ట్‌మెంట్‌లోనే 'అబార్షన్' అయిపోయింది. అక్కణ్నించి ఆవిడ తేరుకోలేదు. వాతం చేసింది. దీర్ఘ రోగంగా మారింది. ఓ వైపు డ్యూటీలు చేస్తూ , మరో వైపు భార్యకీ, కూతురికీ ముకుందం మాస్టారే సేవలు చేశారు. సరళకి సొంతంగా ట్యూషన్ చెబుతూ ప్రయివేటుగా మెట్రిక్యులేషన్ వరకు చదివించారు. రెండేళ్ల క్రితం భార్య పరిస్థితి ముదరబెట్టింది. పునిస్త్రీగా ఆవిడ కన్నుమూసింది.

అప్పట్నించి ముకుందం పూర్తిగా అంతర్ముఖుడైపోయారు. ఆధ్యాత్మికంలో పడిపోయారు. స్టేషన్‌లో ఉద్యోగం.. ఇంట్లో ధ్యానం - ఈ రెండే ఆయనకు తెలిసిన లోకం! అలాంటి మనిషి ''అమ్మాయ్ సరళా''అని గొంతెత్తి పిలిచేది అదిగో ఉదయం పదకొండుగంటల వేళ క్యాష్ బ్యాగ్‌కి సీలువేసేటప్పుడే!

అలా ఓ రోజు సరళ దీపం జ్వాలలో లక్కని కరిగిస్తుంటే ఆమె మనసు భగ్గుమనే సంఘటన జరిగింది.

జోనల్ హెడ్ క్వార్టర్స్ నుంచి ఆడిటర్ల బృందం వచ్చింది.ఆదాయం లెక్కలు చూసింది. కనీస ఆదాయం కూడా లేనందువల్ల అక్కడ టిక్కెట్ల అమ్మకం కిట్టుబాటు కాదని, అందువల్ల ఆ స్టేషన్‌ని వాణిజ్య పరమైన లావాదేవీలకు అనర్హమైందిగా ప్రకటించి కేవలం ఆపరేటింగ్ అవసరాలకే పరిమితం చేయాలనీ- పై అధికారులకు సూచిస్తూ గట్టి రిపోర్టుని రాశాడు సీనియర్ ఆడిటరు.

''పుణ్యం కట్టుకున్నారు బాబూ! గుర్రం గుడ్డిదైనా దాణాకి లోటులేదన్నట్లుగా ఉంది ఇక్కడి క్యాష్ బ్యాగ్ తతంగం''అన్నారు ముకుందం మాస్టారు.

సరళ మాత్రం బాధ పడింది.

రోజులో కాసేపయినా నాన్నతో మాట్లాడే అవకాశం ఇక ముందు తనకి లభించదు. దాంతో పాటు శేఖర్, తనూ మనసు విప్పి మాట్లాడుకునే మార్గమూ ఉండదు.

శేఖర్- తన చిన్ననాటి స్నేహితుడు. వాళ్లనాన్న సుబ్రమణ్యంగారు కూడా స్టేషన్ మాస్టరే. ఆయనా ముకుందం మాస్టారూ ఇరుగు పొరుగు స్టేషన్లలో పని చేసేవారు. మంచి మిత్రులు. శేఖర్ హాస్టల్‌లో చదువుకున్నాడు. సెలవుల్లో వచ్చినప్పుడు ముకుందం మాస్టారి ఇంట్లోనే ఎక్కువగా ఉండేవాడు. డిగ్రీ పాసై, రైల్వే సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి, ఏ.ఎస్.ఎమ్ ఉద్యోగంలో చేరాడు. కొన్నాళ్లపాటు తమ పక్క స్టేషన్‌లోనే పని చేశాడు. అప్పుడు బ్లాక్ ఫోన్‌లో శేఖర్, సరళ మాట్లాడుకునేవారు. గార్డు ద్వారా ఉత్తరాలు మార్చుకునేవారు. కానీ, కొన్నాళ్ల క్రితం శేఖర్ డివిజనల్ క్యాష్ ఆఫీసులో 'క్యాష్ విటనెస్'గా వెళ్లాల్సి వచ్చింది.

అక్కడికి వెళ్లిన తరవాత కూడా ఆ ఇద్దరికీ సమాచార బంధం కొనసాగుతూనే వచ్చింది. ముకుందం మాస్టారు స్టేషన్ నుంచి రోజూ వచ్చే క్యాష్ బ్యాగ్‌ని శేఖర్ సమక్షంలోనే క్యాషియర్ తెరిచేవాడు. కాగితాలే తప్ప అందులో కరెన్సీ ఉండదని అతనికి తెలుసు. అందుకే అనాసక్తంగా పక్కన పడేసేవాడు. కానీ శేఖర్‌ని అందులో కరెన్సీ కన్నా విలువైన సరళ ఉత్తరం పలకరించేది! ఖాళీ బ్యాగ్‌లో ఎక్నాలెడ్జ్‌మెంట్‌తో పాటు శేఖర్ రాసిన జవాబు మర్నాటి ప్యాసింజర్‌లో సరళకి చేరుకొనేది!

ఇప్పుడు- ఆ ఛానెల్‌ని మూసేసి ఆడిటర్లు పుణ్యం కట్టుకొన్నారు. అక్కడ శేఖర్... ఇక్కడ సరళ- ఇద్దరికీ దిక్కుతోచని పరిస్థితిలో ఓ రోజు ఉదయం పదకొండు గంటల వేళ-

''అమ్మాయ్ సరళా''

ముకుందం మాస్టారి గొంతు స్టేషన్ కిటికీ లోంచి వినిపించింది.

సరళ దిగులుగా వచ్చింది.

చేతిలో అగ్గి పెట్టె లేదు.. దీపం బుడ్డీ లేదు...

ముకుందం అమ్మాయి వైపు ఆప్యాయంగా చూశారు.. చూపులతోనే ధైర్యం చెప్పారు...

''నీ దిగులు అర్థమైందమ్మా. శేఖర్ వాళ్ల నాన్న సుబ్రమణ్యం గారితో మాట్లాడాను. మంచిరోజు చూసుకొని తాంబూలాలు పుచ్చుకోడానికి వస్తారట''

ఏణ్నార్థం తరవాత ముకుందం మాస్టారు మనసు విప్పి మాట్లాడారు. ఎన్నో ఏళ్ల తరవాత తండ్రి ముఖంలో చిరునవ్వులు చూసింది సరళ!

*



## కమల్ సినిమాలో మోహన్ లాల్

'మర్మయోగి'కి ముందు ప్రారంభం కాబోతున్న కమల్‌సినిమా 'తలైవన్ ఇరుక్కిరన్' అనే సినిమాలోని నటనా వర్గం సినీ వర్గాల్లో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే కమల్ తోపాటు హీరో వెంకటేష్ ఒక ముఖ్యపాత్ర పోషించనున్నారని తెలిసింది. ఇప్పుడు తాజాగా దానికి మరో సంచలనం జత కూడింది. ప్రముఖ మళయాళం నటుడు మోహన్ లాల్ కూడా ఇందులో నటిస్తున్నాడట. అంతేకాదు, పాత తరం బాలీవుడ్ హీరో రిషీ కపూర్ కూడా ఒక ముఖ్య పాత్రకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల వల్ల ఆగిపోయిన 'మర్మయోగి' నిర్మాణానికి ఈ సినిమా ద్వారా ధనం సమీకరించాలని కమల్ భావిస్తున్నాడు. ఈ సినిమాకు కథ కథనాలను కమల్ హాసనే అందిస్తున్నాడు. ఎ.ఆర్. రహ్మాన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. కాగా 'మర్మయోగి' హీరోయిన్లు త్రిషా, శ్రియలే ఇందులోనూ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇది 'మైకేల్ మదన్ కామరాజు', 'పంచ తంత్రం' సినిమాల్లాగా ఒక సరదా చిత్రం అంటున్నాడు కమల్.